# 'గ్రీటింగ్స్'

రచన: ఎమ్మెస్సార్ మూర్తి

షమీమ్ ఈ సారి ఒంటరిగా రాదు. వెంట నా ప్రతిరూపాన్ని తెస్తుంది. పురిట్లో చూస్తే చిన్న పిల్లాడు గీసిన బొమ్మలా ఉన్నాడుగాని, నేనిక్కడికి వచ్చాక, వాడి జ్ఞాపకాలు వాడికంటె పెద్దవై గిలి పెడుతున్నాయి. ఇంతకంటె పెద్ద ఇంట్లో వుంటే, ఇంట్లో నీళ్ళవసతి బాగావుంటే, ఇద్దరూ రేపు మాపు స్నానం చేసి, ఎప్పటి కప్పుడు కడిగిన ముత్యాల్లా ముద్దుగా ఉంటారు.

ఇల్లు మార్చాను. దీపావళి వస్తోంది. షమీమ్ అప్పుడే రాదు. ఈ నాలుగు రోజులు దేశ మాబాల గోపాలానికి గ్రీటింగ్స్ సార్ట్ చేసీ చేసీ కళ్ళు నొప్పెట్టాయి. సెలవ రోజునా స్వయం పాకమేమిటని, శుభ్రంగా స్వాగత్‌లో భోంచేసి వచ్చాను. ఎప్పుడెప్పుడు పక్కమీద పడదామా అన్నంతతూలుడుగా ఉంది. నములుతున్న కిళ్ళీలోని పిప్పరమెంటు జిల్లుమని పిస్తోంది. తలుపు తీశాను. కిటికీ పక్కగానే నా పక్క తెల్లదుప్పటి మీద తెల్ల కవరు. నములడం ఆగింది. చొక్కా విప్పుతూ కవరు వెల్లికిలా వేసి చూశాను.

గ్రీటింగ్స్!

ఇల్లు మారాక అడ్రసు ఇంకా ఎవరికీ ఇవ్వందే! అడ్రసు చూశాను.

'సౌమ్య
8-5-22
పంజాగుట్ట; హైదరాబాదు.'
ఓహో–ఇదివరకు ఉన్నవాళ్ళయి ఉంటారు.

ఫోల్డ్ తీసి చూశాను. రాధాకృష్ణులు, యమునా తీరం. చక్కని గీతబొమ్మలు. వాళ్ళిద్దరి తన్మయత్వాన్ని మనకూ కాస్తంత పంచి ఇచ్చే చిక్కని రంగులు. లోపలివేపు చూడకుండా యెలా వుండగలను? ఇంగ్లీషులో ఉన్న సందేశం చదవడంకంటే ఎవరు పంపారోనన్న ఆత్రుత. సంతకం కోసం గబా గబా కళ్ళు కిందికి నడిచాయి.

ముచ్చటగా వుంది "వసంత–72" అని.
ఎడంపక్క మూలలో అడ్రసుంది.
"కేరాఫ్ కొండలరావు,
న్యూ బాకారాం; నం. 10-7-112/3
హైదరాబాదు"

లోకల్లో వచ్చిందేనే!-తిప్పి పంపిద్దా మనుకుంటూ అల్మారాలో పడేశాను. ఆవేల్టికి నిద్రపోయాను.

o o o

షమీమ్ వచ్చింది. వస్తూ వాళ్ళ బాచీని వెంట తెచ్చుకుంది. టాక్సీ మాట్లాడాను, సస్పెన్సులో వుంచాలని ఇల్లు మార్చిన విషయం చెప్పలేదు. సైదాబాదు పోవాల్సిన టాక్సీ సైఫాబాదు మీదుగా పోవడం చూసి "ఎక్కడికండీ ఇటు" అని వెంటనే టాక్సీ వాణ్ని అడిగేసింది. నేన్నవ్వి ఇల్లు మార్చేశానోయ్ అని చెప్పేశాను.

"ఎందుకు?"

"ఎందుకేమిటి. స్పెషియస్ హౌస్. పిడికీ–నీకూ సెపరేట్ రూమ్.

ఇల్లు నచ్చిందా అనడిగాను.

"నచ్చినట్లే ఉంది. నాన్న రిటైరవక ముందు పంజాగుట్టలోనే ఉన్నాం"

"ఇంత ఇల్లు మీ బెటాలియన్ అంతటికీ యెలా సరిపోయింది?"

"ఈ ఇంట్లో కాదండి, ఈ ఇంట్లో మా వసుంధర టీచరని ఉంటేవారు. ఆవిడకి నేను వంటచేసి పెట్టడం-నాకు ఆవిడ చదువు చెప్పడం."

బాలింత కళలు పోగానే "సినిమా చూసి చాలా రోజులయిందండీ" అంది.

"దీనికి ఓరకంట చూస్తూ అడగఖ్ఖర లేదు. ఫహీమ్‌కూడా కబురు చెయ్యమంటావా?"

"ఆఁ ఏఁ అఖ్ఖరలేదు. ఇన్నాళ్ళనుంచి పిల్లాణ్ని చూడ్డానికైనా రాలేదు. మన మిద్దరమే వెళ్దాం."

ఆడవాళ్ళంతే! సెంటిమెంటల్ ఫూల్స్! స్వంత చెల్లెళ్ని సాధిస్తోంది!! డోన్ట్ బీ సిల్లీ. ఇది మీ కర్నూలు "ఏ" క్యాంపు కాదు తల్లీ-హైద్రాబాద్ సిటీ, వాళ్ళిద్దరే గదా ఇంటిలో - పైగా షమ్మీ...... నీ చెల్లెలు నీ వారసురాలై కూచుంది"

"అంతే?..."

"ఆఁ అదే..."

"ఎన్నో నెల?"

హజమత్ గాడికేఁ తెలుసు. ఆరో నెలంటున్నాడు.

"పేద్ద...మీకేబాగా తెలును. అయితే ఎక్స్ఛేంజికి ఫోన్ చెయ్యండి. సాయంత్రం రమ్మని. బాలాజీలో నా ఫేవరెట్ సినిమా''

"ఏఁవిటండోయ్...?"

జై పాతాళభైరవి - నరుడా ఏమి నీ కోరిక...", అభినయ ముద్రతో అలానే నిలబడింది.

''నరికొత్త కాపీ అయితే చాలు. ఇప్పుడు నన్ను ఫోనుకి పైనలు తగలెయ్యమంటావు. మీ ఆపరేటరు మరిదిచేత అక్కడా ఇక్కడా ఫోన్లు పెట్టించుకోండి. అక్క చెల్లెళ్ళిద్దరూ హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు.

హజమత్‌కు ఫోన్ చేసి వచ్చాను.

చిక్కడపల్లి వరకు బస్ చార్జీలకై ఇరవై రూపాయలు మార్చడం ఎందుకని చిల్లర పైసల కోసం అల్మారా వెదుకుతున్నాను. అల్లా-గ్రీటింగ్స్ కనబడ్డాయి.

అరెరె...ఎన్నాళ్ళయింది. జి.పి.ఓ.లో పోస్ట్ చేసినా బావుండేది. మళ్ళీ ఓ సారి ఆ బొమ్మ చూశాను. అడ్రసూ చదువుకున్నాను. చాల రోజులు ఆలస్యం చేశాను. ఆ గ్రీటింగ్స్ అంత అందంగా ఉండకపోతేనూ నేను ఆర్. యమ్. యస్. సార్టర్ను కాకపోతేనూ—పనిమనిషి చేత దాన్ని పారవేయించి ఉండే వాణ్ని. పోయేది మ్యాటినీకి కదా...జేబులో పెడితే నలుగుతుందేమోనని, షమీమ్ వానిటీబాగ్‌లో వేశాను. ఫహీమ్‌కు ఇంటి దగ్గర్నుంచి తెచ్చిన జాకెట్ గుడ్డలూ – ఇతరత్రా అందులో వున్నాయి. షమీమ్‌ని అక్కడ వదిలేసి, గ్రీటింగ్ చేత్తో పుచ్చుకుని బాకారాం వెళ్ళొచ్చు, జ్ఞాపకం చేయమని చెప్పాను.

○ ● ○

సినిమా అయింది. బాకారాం గుర్తుకొచ్చింది. షమీమ్ సినిమాకి బాగ్ తీసుకురాలేదు. నాకోపం వచ్చింది. కనీసం చెప్పడమైనా నా ధర్మంగా భావించాను, మళ్ళి చిక్కడపల్లి వెళ్తే ఆలస్యం అవుతుంది అడ్రసు గుర్తుంది. నాకు బాకారాంలో పని ఉందనీ, వాళ్ళ ముగ్గుర్నీ పొమ్మనీ చెప్పాను.

ఇల్లు ఈజీగానే గుర్తుపట్టాను. తలుపు తట్టాను, కిటికీలోగుండా చూచాను. అది అట్టే పెద్దయిల్లుకాదు నీట్‌గానే ఉంది. ట్యూబులైటు వెలుగుతోంది. వంట జరుగుతున్నట్టు ఘుమ ఘుమ పోపు వాసనొస్తుంది. వెనక చిన్న కిచన్ ఉన్నట్టుంది. 'వసంతగారూ' అని పిలుద్దామను కున్నాను, ఎంతకూ రాకపోయే సరికి ఇంతలో ఓ లావుపాటతను బయటికివచ్చాడు. కొండ్రాలావే అయివుంటాడు. నేను విష్ చేశాను. కూర్చోండన్నాడు,

క్షమించండి ఈ యింటి అడ్రసు నుండి వంపిన గ్రీటింగ్ ఒకటి మా యింటికొచ్చింది. పోస్ట్ చేద్దా

మనుకుని మర్చిపోయాను. చాలరోజులైంది ఈరోజు తెద్దామనుకుని కూడ మర్చిపోయాను. నేను జి పి ఓ. లో పన్జేస్తున్నాను. రేపులోకల్లో పంపిస్తాను. ఆ పేరు గలవాళ్ళు ఆ యింట్లో లేరు, మేముంటున్నాము'

'మీరు పోస్ట్‌మన్‌లావచ్చి సంజాయిషీ ఇస్తున్నారు అంత శ్రమ ఎందుకు తీసుకున్నారండీ అనవసరంగా'

'ఆ గ్రీటింగ్ అలావుంది గనక' అన్నాను.

నవ్వుకున్నాము. అతడంతలోనే ఫీలవుతూ దిగులుగా చెప్పాడు.

'ఇప్పటికి ఏడు గ్రీటింగ్స్ వెళ్ళాయి ఇంతవరకూ జాడలేదు. శేషుగాడి ఆత్మకు శాంతిలేదు. కాఫీ ఇస్తానుండండి అంటూ లోపలికెళ్ళాడు.

శేషుగాడు...వసంత...శేషగిరి...గిరిబాబు గబగబా నా మనసు వెనక్కి పరుగెత్తింది.

o o o

అమీర్‌పేటలో అన్‌ట్రైయిన్డ్ టీచర్‌గా పన్జేస్తుండగా ఇరానీకఫేలోగిరిబాబు కలిసేవాడు. ఇంకా పద్దెనిమిది నిండనివాడు. నాకు ఇరవై ఒకటి.

సాయంత్రం నే వచ్చేవేళకు ఓ కార్నర్ సీట్లో, క్యాలిక్యులస్‌తో కుస్తీ పడుతుండేవాడు. నాకు ప్రశాంతంగా ఉంటేనేగాని చదవబుద్ధికాదు. ఈ కుర్రాణ్ణి చూసి ఆశ్చర్యంవేసింది. అడిగాను 'చాయ్ తాగుతూ సాల్వ్ చేస్తుంటే ఈజీగా వచ్చేస్తాయండీ...ఇలాంటి వాతావరణంలోనే నేను బాగా చదువుతాను'అన్నాడు

ఓరోజు వర్క్ లేకుండా ఊరికే కూర్చున్నాడు. పరీక్షలింకా కానేలేదు. చాలా "మూడీ"గా ఉన్నాడు తన ఫామిలీ విషయాల్తో దిగులుగా ఉన్నాడేమోనని నే కదిలించలేదు.

కబుర్లమధ్యలో కక్కేశాడు—తనకో ప్రేమ ఉదంతం ఉందని ఇక ఆ వయసులో కుర్రాణ్ణి అక్కడ వదలకూడదు. అది పూర్తిగా కక్కేంత వరకూ, చెవులు మూయాల్సిందే!

విపరాలడిగాను

ఆ అమ్మాయి తిరస్కరిస్తోందని చెప్పాడు. మా ఇద్దరి సంభాషణ ఇప్పటికీ నా చెవుల్లో మ్రోగుతోంది

"తిరస్కరిస్తే బాధపడను నన్నొత్త రౌడీ వెధవ అనుకుంటోంది ఆ బాధ వద్దేను"

శేషగిరి పీలగా ఉంటాడు. మనిషిలో కాఠిన్యం కన్పించదు. జాలిచూపుల్తో ఆకల్తేని మేకపిల్లలా ఉంటాడు అంచేత ఇదంతా తన మనసులో అల్లుకున్న భావనేనని నాకర్థమైంది.

సానుభూతిగా భుజంతట్టాను నవ్వుతూ..."యూ సిల్లీబాయ్"అన్నాను.

సీరియస్‌గా చూశాడు. 'మీకేం తెలియదు. ఒక అమ్మాయి మిమ్మల్ని పుగుగ్గా చూసినపుడు -మీకర్థమౌతుంది' నేను సర్దుకున్నాను. ఇక తనని సమర్థించకపోతే, గగ్గోలు పెట్టేట్టున్నాడు.

"సో"

'నన్నేం చెయ్యమంటారు ? ప్రేమించక్కర్లేదు– నన్ను మంచాడనుకుంటే చాలు'

'ఆ అమ్మాయి చాలా అందంగా ఉంటుందా?'

'అవన్నీ మీకెందుకు?'

నేను కొంచెం ఇనసల్ట్‌గా ఫీలయ్యాను ఆ అడగడంలో 'ఏడిశావులే–నువ్వెప్పుడైనా ప్రేమిస్తేగదా... నా గొడవేదో నన్ను పడనీయ్' అన్నట్టు ధ్వనించింది

'కేస్ అంతా ఇవ్వండి క్లూ ఎలా దొరుకుతుంది? ఫర్ ఎగ్జాంపుల్ నీ పేరేమిటి?-శేషగిరి-కాదా...ఎంత ఔట్ డేటెడ్! ఇంకానయం ఆదిశేషయ్య అనిపెట్టుకోలేదు.

'ఆ., పేర్లో ఏ వుందండీ...'

'పేర్లోనే ఉంది. పచ్చిపులుసు సత్యవతమ్మ అనే అమ్మాయిని నువ్వు ప్రేమించానంటే నేను చచ్చినా నమ్మను. నువ్విప్పుడు ప్రేమించిన అమ్మాయి అం

దంగా ఉంటుందో లేదో నువ్వు చెప్పలేదు. కాని పేరు చాలా అందమైందై ఉండాలి ఏమంటావ్?'

శేషగిరి కళ్ళు మిలమిల్లాడాయి. 'ఎలా తెలును?'

'అదంతే! అన్నేత నువ్వా పేరు మార్చుకో- ఆ శేషాన్ని తీసి శుభ్రంగా 'గిరిబాబు' అంటే ఎలాఉందో తెలుసా! ఎవర్ గ్రీన్. ఇంతకీ నీ పేరు చెప్పేశే వేమిటి?'

'అయ్యో అడక్కముందే చెప్పేశానే...అయితే సార్ నన్నిప్పుడేం చేయమంటారు?'

శేషగిరి ఇక నేనేది చెబితే అదే తు. చ. తప్ప కుండా చేసేట్టున్నాడు.

'నీమీద కోపం కలిగినట్లు నీకెట్లా తెలును?'

'అసలు ఆ అమ్మాయంటే నాకెంతో ఇష్టంసార్. తను బోర్డ్ ఆఫ్ రెవిన్యూ దగ్గర బస్సెక్కిందాకా నేనూ ఆ ప్రాంతాల్లో నే వెయిట్ చేసి అదే బస్ఎక్కు తాను, బస్సులో నన్ను చూసిందో — గుడ్లురుము తుంది. నిజంగా ఎంత బాధ పడ్డాననుకుంటున్నారు'

'ఇంతకీ నువ్వేం చెయ్యిందే:'

'అదేనండి అప్పటికీ ఓ రోజు తను దిగ్గానే నేనూ దిగిపోయాను. వెంటనే అడుగులో అడుగువేస్తూ నడు స్తున్నాను. వెనక్కి తిరిగి చూసింది, ఓ క్షణం ఆగింది. జోడు తీస్తుందేమోఅన్న సందేహంవచ్చింది కొట్టినా బావుణ్ను బావురుమని అక్కడే ఏడ్చేసేవాణ్ణి కానీ గుడ్లురిమి నేలమీద తుపుక్కున ఊసింది. నేను జాలిగా చూశాను. ఏం అన్నట్లు నొసలు చిట్లించింది.'

ఏ చదువుతున్నారండీ అనడిగాను చాల విన యంగా.

అటూ ఇటూ చూసి- 'బి యస్సీ' అంది.

నా పేరు శేషగిరి. మీ పేరేమిటో తెలుసుకోవచ్చా అనడిగాను.

'వసంత—ఇక చాలా' అంది అంటూ ఆగకుండా వెళ్ళిపోయింది.

గిరిబాబు ఖాళీ టీకప్పును బరువుగా టేబిల్ మీద పెట్టాడు. అతనికప్పుడుంది కేవలం అమ్మాయంటే ఫ్యాన్సీఅని, అదట్టే ప్రమాదమైంది కాదని గ్రహిం చాను.

నేను పట్టనట్టు ఊరుకున్నాను. కానీ- నా రెండు చేతులు పట్టుకుని 'క్లూ చెప్పరూ మీ కడుపున పుట తాను ప్లీజ్' అన్నాడు.

గిరిబాబుకి నా గురించి ఏమీ తెలీకపోయినా, అత నికి నా వయసుమీద భరోసా ఉంది. ఆ వయసు తెచ్చిన అనుభవం మీద నమ్మకముంది. నా మాటల మంచితనంమీద అపారమైన గురి ఉంది.

అంచేత నేనేదైనా చెప్పకపోతే అతడికి తప్ప కుండా కోపం వస్తుంది.

ఆలోచిస్తున్నాను. ఓ ఐడియా వచ్చింది.

'ఇంటి అడ్రసు తెలుసా?' అనడిగాను.

'తెలును'

'మరింకేం డైరెక్టు ఆటాక్-వసంత ... బియస్సీ సో అండ్ సోస్ట్రైట్. దెబ్బమ్మట నువ్వంటే నదభి ప్రాయం కలగాలి. బట్...ఐకాంట్ సే... నిన్ను ప్రేమిస్తుంది అని గ్యారంటీ ఇవ్వలేను'

'ఏంచేయమంటారు? ఆత్రుతగా టేబిల్ మీదకి వంగాడు. టేక్ డౌన్ లౌలెటర్ డిక్టేటు చేస్తాను— మైడియర్ వసంతా—' కాలరెత్తి వెనక్కి వాలి, మొదలు ఎలా పెట్టాలో అని ఆలోచిస్తున్నాను.

గిరిబాబు అదిరిపోయేలా నవ్వాడు. హోటల్లో అందరూ ఇటే చూశారు. నాకాశ్చర్యం వేసింది. ఏమి టలా నవ్వుతున్నావని అడిగాను.

'మాస్టారూ—మీరూ ఫెయిలయిపోయారు' అంటూ ఇంకా నవ్వుతూనే వున్నాడు.

'అంటే?'

"అంటే ఆ అమ్మాయి చదివేది బియస్సీకాదు, తన పేరు వసంతా కాదు."

"తన్నదియ్యా—మరలా ఎందుకు చెప్పింది?"

'అదేగదా నేనంటూంట, తనకిష్టంలేదు. తన చేతుల్లో వి. యూ. సీ బుక్సు రోజూ చూస్తూనే ఉంటాను. తనని స్నేహితులు పిలుస్తుంటే వింటూనే ఉంటాను.

'మైగాడ్'

"మరేంవనుకున్నారు? మీ కంటే మా ఫ్రెండే తెలివైందని ఒప్పుకుంటారా?"

నాకు చరుక్కుమని తగిలింది ఆమాట, నన్ను దెబ్బతీశారు-వీళ్ళద్దరు కలిసి' సంతోషంలో మరో టీ కి ఆర్డర్ వేశాడు.

'ఇప్పుడేమంటారు?'

నేను ఆలోచిస్తూ కూర్చున్నాను.

'లేదు సార్, ఇక లాభంలేదు. ఐకాంట్ బేర్ దిస్ బాధా' అంటూ వేడి టీ సిప్ చేస్తున్నాడు.

నేనూ టీ తీసుకొన్నాను. నాలుక చుర్రుమన్నది. అంటే అంది అందమైన ఐడియా వచ్చింది. గిరిబాబు భుజంతట్టాను.

'ఏవిటి?'

"నేను చెప్పినట్టుచెయ్యి, నక్సెస్‌కాకపోతే అప్పుడను. వచ్చేది దీపావళి కదా, ఓ అందమైన గ్రీటింగ్ కొను, రాధా కృష్ణులో-మరేదయినా ప్రేమజంటో గొప్పగా ఉండాలి సుమా! చక్కగా ముత్యాల్లా—అక్షరాలు ఆడపిల్లలా వ్రాయి. సంతకం చెయ్. పోష్టు చేసెయ్" గుక్కతిప్పుకోకుండా చెప్పాను.

'వెరీగుడ్'

'అయితే మరి—సంతకం ఎలా' అంటే ఏ పేరుతో చేస్తావ్?"

'మీరన్నారుగా శేషాన్నితీసి గిరిబాబుఅన్నివ్రాస్తాను

'ఫెయిల్...అలా వ్రాసేవంటే కొంపలంటుకొని మరీ ఆరిపోతాయి.'

'మరెలా?'

'అలా అన్నావు బావుంది. గ్రీటింగ్ టెక్స్ట్‌క్రింద వసంత—అని వ్రాయి చాలు, కేరాఫ్ నీ అడ్రస్, వాళ్ళింట్లోవాళ్ళకి అనుమానం ఉండదు.

'మరి నేనే పంపినట్టు ఎలా తెలుస్తుంది?'

'ఊ పూర్ ధాట్, నీకు పేరుమార్చి చెప్పింది కదా అంటే వసంత అని, నువు పేరడిగినప్పుడు తనపేరు చెప్పడం ఇష్టంలేక ఏదో నోటికి వచ్చింది అనేసిందన్నమాట, ఇప్పుడీ గ్రీటింగు వెళ్ళగానే కింద వసంత—అని ఉంటుందిగదా. అప్పుడు ఆసంఘటన గుర్తుకు వస్తుంది. నువ్వు గుర్తుకు వస్తావు దట్సాల్!"

'తనకెవరేనా 'వసంత' అనే స్నేహితు లుంటే?"

'ఉంటే వెంటనే వ్రాసి తెలుసుకోదూ, అయినా ఆ వసంత హేండ్‌రైటింగూ—నీది ఒకటెలా అవుతాయి. డామ్ ష్యూర్. ఆ గ్రీటింగ్ వెళ్ళడం. నువ్వు గుర్తుకి రావడం ఇకనీయిష్టం ఆ గ్రీటింగ్ బొమ్మ-సందేశం ఎలాంటిది సెలక్టు చేస్తావో దానిమీద ఆధార పడి ఉంటుంది'

'గొప్పగా ఉంది సార్ సార్ మీ బుర్ర—వ్వ్ వండర్‌ఫుల్" గిరిబాబులో ఆరోజు ఎంతో గర్వాన్ని చూశాను, ఇక బయిటికి నడిచాం,

"ఇదిగో గిరీ మొదటిసారే రిప్లయికోసరం ఎదురు చూడకు వరుసనా రెండు మూడువెళ్ళే, పాజిటివ్ రిప్లయి తప్పదు, గుడ్‌బై...గుడ్ లక్!"

'ఓకే థాంక్యూ—థాంక్యూవెరీమచ్,'

x x x

ఆ తర్వాత నేను ఆర్, యమ్. ఎస్. కి సెలెక్ట్ అయి మైసూరు వెళ్ళాను గుంతకల్‌లో కొన్నాళ్ళున్నాను, గిరిబాబు సంగతే మర్చిపోయాను,

ఇక్కడికి వచ్చింతర్వాతకూడా తారసపళ్ళేదు,

ఇప్పటికీ గ్రీటింగ్స్ పోస్టు చేస్తున్నాడన్న మాట·

ఆ అమ్మాయి పేరు సౌమ్య—అన్న మాట!!

అతనింకా మంచివాడు కాలేదన్న మాట!!!

గిరిబాబు అజ్ఞానానికి ఆశ్చర్యం వేసింది.

కాఫీగ్లాసు అందుకుంటూ "మీ రెవరండీ" అనడిగాను

"శేషగాడు మా అన్నయ్య!"

గిరిబాబుకి ఇతనికి పోలికలే లేవు. లావుగా బలిష్ఠంగా కండలు తిరిగిన శరీరం. ఏం చేస్తున్నారని అడిగాను.

"ఆర్టీసీ డ్రైవర్ని. పోయిన్నెలే ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడికి వచ్చాను. ఇంకా ఫామిలీ రాలేదు."

"గిరిబాబు చదువుకునేప్పుడు మీరు హైదరాబాద్ లో లేరా?"

'గిరి బాబెవరు?'

'అదే శేషగిరి'

నవ్వుతూ అన్నాడు. 'లేనండీ. చిన్నప్పుడే ఇంట్లోంచి పారిపోయాను. గుంటూరులో ఓ వర్క్‌షాప్‌లో చేరాను, ఆ తర్వాత సర్వీసులో చేరాను'.

'ఇంతకీ గిరిబాబు ఇప్పుడేం చేస్తున్నాడు. ఎక్కడున్నాడు?'

"గిరిబాబూ.. గిరిబాబూ అంటున్నారు. ఇంకెవర్ని గురించైనా అడుగుతున్నారా...లేక .."

"అం అదే శేషగిరే..."

కొండ్రలావు దిగులయ్యాడు. తలనంచాడు.

"వాడుత్త పిరికివాడు సార్· ఎవత్తో అమ్మాయి ప్రేమించ లేదనే దిగులుతో జబ్బుపడ్డాడు. వాడు లెక్కలే చదివాడు. వచ్చిందాకా నిద్రపోయేవాడు కాదు. కానీ...తన ప్రాబ్లమ్... ప్చ్... వాడుత్త సెంటిమెంటల్ గాడు.

నేను మౌనంగా వింటున్నాను.

'పై చదువుకి కలకటా వెళ్ళి ఐక్కా చిక్కిపోయాడు. స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పిచ్చివాడయాడు.

ఇంటికి నేనే తీసుకొచ్చాను. ఓ రోజు పిచ్చిలో నన్ను పిలిచి... ఒరేయ్ కొండలూ... ఈ ఆఖరికోరిక పిచ్చిలో చెప్పడం లేదు నే చెప్పినట్టు చెయ్యి. ఈ అడ్రసుకు ప్రతి దీపావళికి ఇలాంట గ్రీటింగ్స్ పోస్టు చెయ్. సౌమ్య నన్ను మంచివాడను కుంటుంది. నా మనసుకెంతో శాంతి'...అంటూ అప్పటికి ప్రశాంతంగానే నా ఒళ్ళోనే కళ్ళుమూశాడు. కొండ్రలావు కాసేపాగాడు.

"వాడు పోయాక—ఆ అమ్మాయి మీద — నాకు విపరీతమైన కోపం వచ్చింది. అడ్రసు తీసుకుని వెళ్ళాను. అసలక్కడ ఎవరూ లేండే. దీపావళికి వాడు గుర్తుకి రావడం—

పోస్టు చేశావా? అని నా మనసుని తట్టడం..."

నాకు కాఫీ సహించలేదు. బరువుగా కుర్చీలో వాలిపోయాను.

○ ● ○

ప్రతివ్యక్తి జీవిత దృక్పధాల మీద, తన చుట్టూ తిరిగే తనకంటె పెద్దవాళ్ళయిన వారి ప్రభావం కొద్దో గొప్పో ఉంటుంది. ఆ వయసులో అందరు స్నేహితులతో తమ తమ ప్రేమ ఉదంతాలను చెప్పి సలహా కోరడం సహజమే! కానీ ఆ చెప్పే వాళ్ళు అసలు చెప్పవలసింది అటుంచి తమ గొప్పతనం చాటుకోవాలనే స్వార్థాన్ని జోడించి ఏదేదో చెప్తారు. గిరిబాబు సెన్సిటివ్ అని నాకు తెలిసున్నా—అతనిది కేవలం ఫ్యాన్సీ అని గుర్తించినా - ఈ విషయాన్ని ఇంత తీవ్రమైన 'ప్లాటొనిక్ లవ్' కింద పరిగణిస్తాడని అనుకోలేదు. నేను అతన్ని ఎంతవరకు ఈ ఆలోచనల్లో నక్రమంగా నడిపాను? — అనే ప్రశ్న నన్ను నిలదీసింది.

గిరిబాబు నాలో చూసిన వయసూ అనుభవం, మంచితనం, ప్ప్... ఎంత ఘోరం!

నా కళ్లు చెమర్చాయి.

గిరిబాబు పదే పదే జ్ఞప్తికి వస్తున్నాడు. అతని జ్ఞాపకార్థం నా దగ్గర ఏమీ మిగల్లేదు... అహఁ— ఉంది. లేటెస్ట్‌గా వచ్చిన గ్రీటింగ్—

షమ్మీ ఇంకా స్నానం ముగించనే లేదు. ఎవ్వ డెవ్వ డీ కథ తనకి చెబుదామా అనుంది. కళ్ళు మూసుకున్నాను.

అలికిడయితే—అడిగాను— 'షమ్మీ ఆ గ్రీటింగ్ కార్డెక్కడ?'

షమీమ్ పలకలేదు.

కళ్ళు తెరిచాను. షమీమ్ అటెటో చూస్తోంది.

నేను మళ్ళీ అడిగాను.

ఉలిక్కిపడ్డట్టు వెను దిరిగింది. "అదా—చిక్కడ పల్లిలో పోస్టు చేశాను. రిటర్న్డ్ టుది సెండర్"

అయ్యో? అనుకుని అలానే కాసేపు పక్కమీద ఉండిపోయాను.

అరె గిరిబాబు జ్ఞాపకాల దిగుల్తో షమ్మీని— సరిగా చూడనేలేదు. వండర్‌ఫుల్—సందేహం లేదు. పట్టుచీరే!

ఆ చీరలో షమ్మీ అచ్చు వనదేవతలా ఉంది—

అమ్మ దొంగా!...ఎప్పుడు కొనేశావీచీరె?! నాకు చెప్పనే లేదు!!

'కొన్లేదు. మా వసుంధర టీచరు, ఇపుడు కర్నూల్లోనే తెలుగు లెక్చరరు. వాళ్ళింటికి తీసుకెళ్ళి నాకి చీర పెట్టింది.'

"వెరీ ఫైన్...కంగ్రాట్స్! కమ్ హియర్... సే థేంక్స్ విత్ ఎ స్వీట్ సౌండ్..." చేతులు చాపాను

చీరను సర్దుకుంటూ షమ్మీ నా దగ్గరగా వచ్చింది నా చెంపల్ని తన రెండు చేతుల్తో సుతారంగా పత్తింది. అంది. "తనిక్కడున్నప్పుడు నాకో అంద మైన పేరుకూడా పెట్టింది"

నడుంచుట్టూ చేతులేస్తూ లాలనగా అడిగాను- "ఉహుఁ ..ఏఁవిటబ్బా అంత మంచిపేరు?"

"సౌమ్య"

---


# PRAGA TOOLS LIMITED

## Talking about Praga

If Praga Tools is a renowned name today in the field of Machine Tools, it is due in great measure to the international standing of our collaborators. Over the 28 years of existence, our manufacturing activities have escalated from a very limited programme in 1943 to a wide range of Machine Tools, Machine Tool Accessories, Precision Machines and a fulscale Forge & Foundry Division today.

We'd like to drop a few names - world names.

JONES & SHIPMAN

KEARNEY & TRECKER
GEORGE FISCHER
ESCOFIER–PRATT & Co.
gambin s. a.

Praga Tools Ltd.,
SECUNDERABAD-3 (A. P.)